మూసుకుపోయిన ముడసర్లోవ రోడ్లు



రోడ్డు పక్కన డంప్‌చేసిన వ్యర్థాలు

ఆరిలోవ: ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక ప్రశాంత వాతావరణం, పచ్చని కొండల మధ్య గల విశాలమైన రహదారుల్లో ఎంతో ఆహ్లాదం పొందుతూ వాహన చోదకులు ప్రయాణించేవారు. ఇక్కడ ఉదయం, సాయంత్రం వేళల్లో ఎంతో మంది వాకింగ్ చేసేవారు. ఇదంతా ఒకప్పటి మాట. ఇప్పుడు అక్కడా పరిస్థితి కనిపించడం లేదు. విశాలమైన రోడ్లు మూతపడిపోతున్నాయి. ఓ పక్క తుప్పలు.. మరోపక్క గృహ నిర్మాణ వ్యర్థాలు, మట్టి దిబ్బలతో ఇక్కడి రోడ్లు మూసుకుపోయాయి. వీటి మధ్య చెట్ల పొదల్లో మందుబాబుల ఆగడాలు పెరిగిపోతున్నాయి. రానురాను ఈ రోడ్లు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి.

నాడు సందడిగా.. నేడు భయంగా..

నిత్యం జలకలతో చల్లదనాన్ని ఇచ్చే ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక కొండల మధ్య నుంచి సుమారు 15 ఏళ్ల కిందట అప్పటి ప్రభుత్వం విశాలమైన డబుల్ రోడ్లు నిర్మించింది. ఆరిలోవ ప్రాంతవాసులు వీటి మీదుగా ప్రయాణించి రామకృష్ణాపురం వద్ద బీఆర్‌టీఎస్ రహదారికి చేరుకునేవారు. ఆహ్లాదకరమైన వాతావరణం కావడంతో ఎక్కువ మంది ఉదయం, సాయంత్రం సమయాల్లో నడక కోసం వెళ్లేవారు. సబ్ ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుళ్ల ఉద్యోగాల నియామకం కోసం పోలీస్ అధికారులు ఈ రోడ్లపైనే ఐదు కిలో మీటర్లు వరుగు వరీక్ష(పోటీలు) నిర్వహించేవారు. తరుచూ ఈ పోటీలతో పోలీసుల సందడి కనిపించేది. ఇప్పుడా పరిస్థితి కానరావడం లేదు. అటు వైపు వెళ్లడానికే జనం భయపడే పరిస్థితి నెలకొంది.

- లారీలతో గృహ వ్యర్థాలను తీసుకొచ్చి డంపింగ్
- డెబ్రిస్‌తో నిండిపోతున్న విశాల రహదారులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- వాహనాల రాకపోకలకు ఇబ్బందులు

అంతా మట్టి దిబ్బలు.. పిచ్చి మొక్కలే..!

ప్రస్తుతం ఈ రహదారులు డెబ్రిస్, మట్టి దిబ్బలతో నిండిపోయి డంపింగ్ యార్డును తలపిస్తున్నాయి. రెండు లైన్‌లు పూర్తిగా మూతపడ్డాయి. ఇంకొన్ని లైన్‌లు పాక్షికంగా నిండాయి. మట్టి దిబ్బల వల్ల ఇక్కడున్న 80 అడుగులు వెడల్పు తారు రోడ్లు సుమారు 20 అడుగులకు కుదించుకుపోయాయి. ఎటుపక్క చూసినా.. మట్టి దిబ్బలే కనిపిస్తున్నాయి. ఆరిలోవ ప్రాంతంతోపాటు ఎంవీపీ కాలనీ, ఇసుకతోట, వెంకోజిపాలెం, విశాలాక్షినగర్, సింహాచలం ప్రాంతాల నుంచి గృహ వ్యర్థాలను లారీల్లో తీసుకొచ్చి ఈ రోడ్లలో వేసేస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా వాటిని ఇక్కడ డంప్ చేస్తున్నారు. దీంతో ఈ రోడ్లు మూసుకుపోయి వాహనాల రాకపోకలకు వీలు లేకుండా మారాయి. ప్రస్తుతం వాహన చోదకులు అటుగా వెళ్లడం మానేశారు. వీటికి తోడు ఇక్కడి రహదారులకు ఇరుపక్కలా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి మిగిలిన రోడ్డు భాగాలను సైతం మూసేస్తున్నాయి. వాటి చాటున మందుబాబులు, గంజాయి సేవించేవారు, ఆకతాయిలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు.



ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక డబుల్ రోడ్డులో ఇరువైపులా గృహ వ్యర్థాలు, ముళ్ల చెట్లు

ఇక్కడే రైల్వే జోన్ పనులు..

ఈ ప్రాంతంలోనే రైల్వే జోన్ పనులు జరుగుతున్నాయి. ఈ రోడ్లను ఆనుకొని ప్రభుత్వం రైల్వే జోన్ కోసం 56 ఎకరాల భూమి కేటాయించింది. కొన్ని నెలలుగా రైల్వే అధికారులు పనులు చేపడుతున్నారు. వీటి కోసం ఈ రోడ్లు నుంచే భారీ వాహనాలు, లారీలు సామగ్రి తరలిస్తున్నారు. ఇక్కడి రోడ్లు మట్టి దిబ్బలతో మూసుకుపోవడం వల్ల ఆయా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

కొన్నేళ్ల నుంచి మట్టి దిబ్బలు పేరుకుపోతున్నా.. జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడం విశేషం. ఇక్కడ డెబ్రిస్ వేయకుండా అధికారులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

జీవీఎంసీకి రూ.లక్షల్లో ఖర్చు..

కొన్నేళ్లుగా ఆరిలోవతోపాటు నగరంలోని ఇతర ప్రాంతాల నుంచి గృహ వ్యర్థాలను లారీలతో ఇక్కడికి తీసుకొచ్చి డంప్ చేస్తున్నారు. రోడ్లన్నీ మూసుకుపోవడం, వర్షా కాలంలో వాటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికుల నుంచి ఫిర్యాదులు వెళ్లిన తర్వాత జీవీఎంసీ అధికారులు అప్పుడప్పుడు స్పందిస్తున్నారు. కొన్ని రూ.లక్షలు ఖర్చు చేసి ఆ వ్యర్థాలను రోడ్డు పక్కకు పొక్లెయిన్లతో చదును చేయించి వదిలేస్తున్నారు. నిఘా మాత్రం పెట్టడం లేదు. దీంతో మరుసటి రోజు నుంచే వ్యర్థాలను యథావిధిగా ఇక్కడ డంప్ చేసుకుపోతున్నారు. మూడేళ్ల కిందట జీవీఎంసీ అధికారులు సుమారు రూ.40 లక్షలు ఖర్చుచేసి ముడసర్లోవ రోడ్లపై వ్యర్థాల దిబ్బలను చదును చేయించి వదిలేశారు. ఇప్పుడు మళ్లీ వ్యవహారం మొదటికొచ్చింది. వ్యర్థాల దిబ్బలతో రోడ్లు మూసుకుపోయాయి. సంబంధిత అధికారులు దృష్టి సారించి ఇక్కడ వ్యర్థాలు వేయకుండా చర్యలు చేపడితే పర్యావరణాన్ని కాపాడిన వారవుతారని స్థానికులు విన్నవిస్తున్నారు.



రైల్వే జోన్ పనులకు వెళ్లే దారిలో వ్యర్థాల దిబ్బలు



డెబ్రిస్‌తో పూర్తిగా మూతపడిన రోడ్డు

క్లుప్తంగా

వీధి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు



వీధి కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్న వెటర్నరీ సిబ్బంది, పర్యవేక్షిస్తున్న సీఎంవో నరేష్‌కుమార్

ఆరిలోవ: జీవీఎంసీ వెటర్నరీ విభాగం ఆధ్వర్యంలో శనివారం వీధి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టారు. జీవీఎంసీ సీఎంవో డాక్టర్ ఇ.ఇన్.వి.నరేష్‌కుమార్ సమక్షంలో సిబ్బంది 12వ వార్డు పెదగదిలి కూడలిలో వీధి కుక్కలను పట్టుకుని వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా సీఎంవో మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో 52 కుక్కలను పట్టుకుని టీకాలు వేసినట్లు తెలిపారు. కొద్ది రోజులుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అన్ని వార్డుల్లోనూ వ్యాక్సినేషన్ చేపడతామన్నారు. కుక్క కాటుకు గురైన ప్రజల కోసం అన్ని పీహెచ్‌సీల్లో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. కార్యక్రమంలో జీవీఎంసీ జోన్–2 ఏఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్‌కుమార్, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులం అధ్యాపకుడికి ఘన వీడ్కోలు



రమేష్‌ను సత్కరిస్తున్న గురుకులాల అధికారులు, అధ్యాపకులు

ఆరిలోవ: శ్రీకృష్ణాపురం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకులంలో జూనియర్ కళాశాల ఫిజికల్ సైన్స్ అధ్యాపకుడు బి.కె.రమేష్ శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయనకు గురుకులం ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని గురుకులాల్లో రమేష్ 35 ఏళ్ల పాటు విద్యాబోధన చేశారు. గురుకులాల రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రాజ్యలక్ష్మి, విజయనగరం జిల్లా గురుకులాల సమన్వయాధికారి ఎస్.రూపావతి, విశాఖ జిల్లా సమన్వయాధికారి డాక్టర్ ప్రభావతి, శ్రీకాకుళం జిల్లా సమన్వయాధికారి గ్రేస్ అధ్యాపకులు, సిబ్బందితో కలసి రమేష్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా వారంతా మాట్లాడుతూ గురుకులంలో రమేష్ అందించిన సేవలను కొనియాడారు. నిబద్ధత, క్రమశిక్షణతో ఆయన సేవలందించారన్నారు. కార్యక్రమంలో శ్రీకృష్ణాపురం గురుకులం ప్రిన్సిపాల్ రత్నవల్లి, పలు గురకులాల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మునసబ్ వారి వీధిలో విద్యుత్ వెలుగులు



వీధిలో విద్యుత్ స్తంభంపైన లైట్లు సరిచేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

బీచ్‌రోడ్డు: గత మూడు రోజులుగా అంధకారంలో ఉన్న 20వ వార్డు మునసబ్ వారి వీధి సమస్యపై శనివారం 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు అధికారులు తక్షణం స్పందించారు. జీవీఎంసీ సిబ్బంది అక్కడికి వెళ్లి వీధిలోని విద్యుత్ స్తంభాలకు ఉన్న లైట్లను పరిశీలించి, అవి వెలిగేలా చర్యలు చేపట్టారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

వ్యక్తి అదృశ్యం

ఎంవీపీకాలనీ: ఓ వ్యక్తి అదృశ్యంపై ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. మువ్వల అప్పలరాజు అనే వ్యక్తి ఎంవీపీ కాలనీ సెక్టార్–9లో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. ఆర్థిక సమస్యలు, క్రెడిట్ కార్డ్ బిల్లుల కారణంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈ నెల 29న ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. అతడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఫలితం లభించలేదు. అప్పలరాజు భార్య సుజాత చేసిన ఫిర్యాదు మేరకు శనివారం ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం అందించాలని హెచ్‌సీ వరహాలు కోరారు.

సాగర తీర పరిశుభ్రతలో స్వచ్ఛంద భాగస్వామ్యం



విక్టరీ ఎట్ సీ తీరం వద్ద సేకరించిన వ్యర్థాలతో స్వచ్ఛంద సంస్థల సభ్యులు



ఆర్కే బీచ్ వద్ద సేకరించిన వ్యర్థాలతో స్వచ్ఛంద సంస్థల సభ్యులు

ఏయూక్యాంపస్: సాగర తీరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి నిరంతరం నగరవాసులు, స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నాయి. దీనిలో భాగంగా శనివారం ఉదయం ప్లాస్టిక్ ఫర్ చేంజ్ సంస్థ, గార్నియర్ ఇండియా సహకారంతో బీచ్ క్లీనింగ్ కార్యక్రమం నిర్వహించింది. ఆర్కే బీచ్, వైఎంసీఏ–విక్టరీ ఎట్ సీ వద్ద సాగర తీరంలో ఉన్న వ్యర్థాలను స్వచ్ఛందంగా ఏరివేశారు. వీటిలో పెట్ బాటిల్స్ 60 కేజీలు, ప్లాస్టిక్ 300 కేజీలు, గాజు సీసాలు 230 కేజీలు, కొబ్బరి బొండాలు 120 కేజీలు, చెప్పులు 60 కేజీలు, కర్రలు 400 కేజీలు, తాళ్లు, ఇతర వస్తువులు 30 కేజీలు ఉన్నాయి. ప్రజల సహకారం, భాగస్వామ్యంతో ఇటువంటి సమాజహిత కార్యక్రమాలు చేపట్టడం వీలవుతుందని వైజాగ్ ఎన్‌జీవో ఫోరం కార్యదర్శి ప్రజ్ఞాన్ కుమార్ తెలిపారు. సత్యవేణి సమన్వయం చేసిన ఈ కార్యక్రమంలో అర్జున్ తదితరులు, నగరానికి చెందిన 313 మంది స్వచ్ఛందంగా పాల్గొని సాగర తీరాన్ని శుభ్రం చేశారు.

బీచ్‌లో కబడ్డీ.. కబడ్డీ...





ఆర్కే బీచ్‌లో కబడ్డీ సాధన చేస్తున్న గాజువాక ప్రాంత యువకులు

ఏయూక్యాంపస్: సాగర తీరంలోని ఇసుక తిన్నెలపై కబడ్డీ క్రీడాకారులు కఠోర సాధన చేస్తున్నారు. కూతకెళ్తే పాయింట్ సాధిస్తున్నారు. గాజువాక ప్రాంతానికి చెందిన కొంత మంది యువకులు కబడ్డీ క్రీడలో రాణిస్తున్నారు. వీరు శనివారం ఉదయం ఆర్కే బీచ్ సమీపంలో కబడ్డీ ఆడుతూ కనిపించారు. ఇసుకలో రెండు జట్లుగా ఏర్పడి కబడ్డీ సాధన చేస్తూ మెళకువలు నేర్చుకుంటున్నారు. వాతావరణం కూడా చల్లగా ఉండటంతో వీరి ఆట ఉత్సాహంగా సాగింది. పక్కనే కోచ్ గమనిస్తూ వారికి ఆటలో నైపుణ్యాలను అందిస్తూ, మెళకువలను నేర్పుతున్నారు. గెలుపే లక్ష్యంగా పోటీలో దూసుకుపోయే సత్తాను వీరు అందిపుచ్చుకుంటున్నారు.

బకాయిలు తక్షణమే చెల్లించాలి

విశాఖ సిటీ : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో సేవలందించిన రిటైర్డ్ ఉద్యోగులను నిర్లక్ష్యం చేస్తున్నారని సాంఘిక సంక్షేమ రిటైర్డ్ గురుకుల ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు కె.కామయ్య ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. పేద, వెనుకబడిన విద్యార్థులకు విద్యనందించిన తమకు కనీస న్యాయమైన బెనిఫిట్స్ అందక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పదవీ విరమణ చేసిన వారికి రావాల్సిన శాలరీ ఎరియర్స్, డీఏ, మెడికల్ రీయింబర్స్‌మెంట్, ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలు ఉన్నాయని వెల్లడించారు. అధికారులకు ఎన్నిసార్లు వినతులు సమర్పించినా స్పందన లేదన్నారు. ఇప్పటికైనా అన్ని పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పిల్లల పార్కు బురదమయం




ఆల్ ఎబిలిటీ పార్క్‌లో జారుడు బల్ల వద్ద బురద



ఆట వస్తువు చుట్టూ నిలిచిన వర్షపు నీరు

ఏయూక్యాంపస్: బీచ్ రోడ్డులోని పిల్లల పార్కు బురదమయంగా మారింది. వైఎంసీఏ ఎదురుగా ఉన్న ఆల్ ఎబిలిటీ పార్క్‌లోని పిల్లల ఆట వస్తువులు ఉన్న ప్రాంతంలో తాజాగా కురుస్తున్న వర్షాలకు నీరు నిలిచిపోతోంది. గోతులు ఏర్పడిన చోట మట్టిని నింపడం, ఇసుక పోయడం వంటివి చేయాల్సిన అవసరం ఉంది. వేసవి సెలవుల నేపథ్యంలో నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్నారులు ఆడుకోవడానికి ఇక్కడికి వస్తున్నారు. బురదమయంగా ఉన్న పరిసరాలను చూసి వారు నిరాశతో వెనుదిరుగుతున్నారు. అధికారులు స్పందించి పార్క్‌లో బురద లేకుండా చర్యలు చేపట్టాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

• ఎగసి పడుతున్న అలలు



ఋతు పవనాల ఆగమనం, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో సముద్రంలో అలలు ఎగసి పడుతున్నాయి. కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం వద్ద తీరం కోతకు గురైంది. ఒకవైపు అలలు విరుచుకుపడినప్పటికీ.. పర్యాటకులు మాత్రం సముద్రంలో కేరింతలు కొట్టారు.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

నయవంచనలో చంద్రబాబు దిట్ట

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు
- 4న 'వెన్నుపోటు దినం' విజయవంతానికి సిద్ధం కావాలని పిలుపు



వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు తదితరులు

మద్దిలపాలెం: ముఖ్యమంత్రి చంద్రబాబుకు వెన్నుపోటు పొడవడం వెన్నతో పెట్టిన విద్యని, దానినే అస్త్రంగా చేసుకుని ఎన్నికల్లో అమలు కానీ హామీలిచ్చి ప్రజలను నమ్మబలికి నయవంచనకు పాల్పడ్డారని, దానిపై వైఎస్సార్‌సీపీ వెన్నుపోటు దినం పేరుతో పోరాటం చేస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు తెలిపారు. సీతమ్మధారలోని పార్టీ తూర్పు నియోజకవర్గ కార్యాలయంలో శనివారం కె.కె.రాజు, తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, కార్పొరేటర్లతో కలిసి వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4న అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వం.. ప్రజలను మోసపూరిత వాగ్దానాలతో దగా చేసి వెన్నుపోటు పొడిచిందన్నారు. అమలు కాని సూపర్ 6 పథకాలతోపాటు 150కి పైగా హామీలతో రాష్ట్ర ప్రజలను నమ్మబలికి, వారి ఓట్లతో గద్దెనెక్కి వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. ఇలాంటి దగాకోరు, రాక్షస ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జూన్ 4వ తేదీని వెన్నుపోటు దినంగా ప్రకటించారన్నారు. ఆయన పిలుపు మేరకు ప్రతి నియోజకవర్గంలో ఈ నెల 4న వెన్నుపోటు దినం పేరుతో నిరసన తెలిపేందుకు అంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు విజ్ఞాపన పత్రాలు ఇవ్వాలని కె.కె.రాజు కోరారు.

సమావేశంలో కార్పొరేటర్లు ఉమ్మిడి స్వాతి, మొల్లి లక్ష్మి, మువ్వల లక్ష్మి, పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు అక్కరమాని మంగరాజు, పల్లా దుర్గారావు, నడింపల్లి కృష్ణంరాజు, రవిరెడ్డి, ఉమ్మిడి దాసు, రామన్నపాత్రుడు, బోణి శివరామకృష్ణ, అల్లంపల్లి రాజబాబు, పేర్ల విజయచందర్, గొలగాని శ్రీనివాస్, పీతల గోవింద్, శ్రీను, సత్యాల వెంకట్, నీలారెడ్డి, ఉమ్మిడి కల్యాణ్, మదుపాడ రవి, సూర్యనారాయణ, దేవరకొండ మార్కండేయులు, పీలా ప్రేమ్, సూర్యనారాయణరెడ్డి, సాగరిక, చొక్కర శేఖర్, చొల్లంగి నాగేశ్వరరావు, సంపంగి సురేష్, రాంప్రసాద్, యనమరెడ్డి కుమార్‌రెడ్డి, కన్నబాబు, భవానీశంకర్, శ్రీనివాసరెడ్డి, ఈశ్వరరావు, మక్బూల్, ఇమంది సత్యనారాయణ, జాన్ విక్టర్, రావాలు, గణేష్, మధుసూదనరెడ్డి, పోలిరెడ్డి, గణేష్‌రెడ్డి, రమణరెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ మద్దిలపాలెం జోన్ నూతన కార్యవర్గం ఎన్నిక



జోన్ అధ్యక్షుడు అప్పలరాజు



కార్యదర్శి వెంకటరావు

మద్దిలపాలెం: సీఐటీయూ తూర్పు నియోజకవర్గ మద్దిలపాలెం జోన్ నూతన కార్యవర్గ ఎన్నిక శనివారం స్థానిక సీతారాం ఏచూరి భవనంలో జరిగింది. మద్దిలపాలెం, ఆరిలోవ, మధురవాడలు కలిసి మద్దిలపాలెం జోన్ ఉమ్మడి ఎన్నికలు నిర్వహించాయి. మద్దిలపాలెం జోన్ అధ్యక్షుడిగా డి.అప్పలరాజు, కార్యదర్శిగా పి.వెంకటరావు, కోశాధికారిగా ఎం.సి.హెచ్.అప్పుడు, ఉపాధ్యక్షులుగా పి.రాజకుమార్, జె.ఆర్.నాయుడు, ఐ.సి.నాయుడు, బి.రత్నం, జి.మంగశ్రీ, కె.సత్యనారాయణ, సహాయ కార్యదర్శులుగా ఎ.సింహాచలం, కె.కుమారి, ఎస్.రామప్పడు, సిహెచ్.పార్వతమ్మ, పి.శంకరరావు, వి.కృష్ణారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వి.నగేంద్రకుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యుడు వి.కృష్ణారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వల్ల అసంఘటిత రంగ కార్మికుల ఉపాధికి రక్షణ లేకుండా పోయిందన్నారు. బిల్డింగ్ కార్మికుల వెల్ఫేర్ బోర్డును ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అక్రమంగా తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని తీర్మానించామన్నారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు

ఆరిలోవ: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడానికి ఈ నెల 4న చేపట్టనున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలంతా తరలిరావాలని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు పిలుపునిచ్చారు. 9వ వార్డు జోడుగుళ్లపాలెంలో కార్పొరేటర్ కోరుకొండ వెంకటరత్న స్వాతి ఆధ్వర్యంలో శనివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్నా.. ఎన్నికల హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. దీనికి నిరసనగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జూన్ 4న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలంతా కలిసికట్టుగా విజయవంతం చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అప్పారావు, పిట్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలకు కేంద్రంగా విశాఖను తీర్చిదిద్దాలి



జ్యోతి వెలిగించి టోర్నమెంట్ ప్రారంభిస్తున్న ఉషశ్రీ తదితరులు

ఎంవీపీకాలనీ: ఎస్ 3 స్పోర్ట్స్ ఏరీనాలో ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 400 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ఇండియన్ ఆయిల్ విశాఖ డివిజన్ హెడ్ బుచ్చయ్య, సీనియర్ మేనేజర్ చైతన్య, క్రీడాకారిణి, కార్పొరేటర్ ఉషశ్రీ తదితరులు జ్యోతి వెలిగించి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖను క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. అండర్ 11, 13, 15, 17 ఏళ్ల విభాగాల్లో క్రీడాకారులు పోటీపడుతున్నారు. ఎస్ 3 స్పోర్ట్స్ ఏరీనా నిర్వాహకుడు సహాని తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



పదవీ విరమణ చేసిన మహందాతను సత్కరిస్తున్న సహోద్యోగులు

మద్దిలపాలెం: అంకితభావంతో పనిచేస్తే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ నగేష్ పట్నాయక్ అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మలేరియా విభాగంలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పదవీ విరమణ చేసిన వారాధి మహందాతను శనివారం ఆయన సిబ్బందితో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 62 ఏళ్ల వయసులో కూడా ఎంతో చురుగ్గా అంకితభావంతో ప్రజలకు సేవందించిన మహందాతని సిబ్బంది ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. చివరి రోజు కూడా విధులకు హాజరయ్యారని, ఇది ఆయన పనితీరుకు నిదర్శనమని అభినందించారు. పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో సంతోషంగా కుటుంబంతో కలిసి గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

తీరం.. వ్యర్థాలమయం



సాగర తీరం పరిసరాలు అధ్వానంగా మారాయి. ఎక్కడ చూసినా చెత్తాచెదారం, వ్యర్థాలతో నిండిపోయాయి. ఇసుక తెన్నెల్లోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అంతటా దుర్గంధం వెదజల్లుతోంది. కోస్టల్ బ్యాటరీ నుంచి రుషికొండ వరకు ఇదే విధంగా ఉంది. పెదజాలరి పేట తీరంలో చెత్త పేరుకుపోయిన దృశ్యమిది.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం